మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ



మహిళా సంఘాల సభ్యులకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు



పీబీ దేవంలో వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేసిన దవులూరి దొరబాబు

కొత్తపల్లి: మహిళలు తమ కాళ్ళపై తాము నిలబడి, ఆర్థికంగా లక్షాధికారులు కావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వెనుక ఉన్న లే అవట్‌లో శుక్రవారం నిర్వహించిన డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల పరిధిలో 1618 డ్వాక్రా సంఘాలకు చెందిన 16,180 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.13.17 కోట్ల విలువైన నమూనా చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పాలకులు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని మహిళలను మోసగించారన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సుమారు 22 వేల మందికి ఇళ్లపట్టాలు ఇవ్వడమే కాకుండా ఇళ్ల నిర్మించుకునేందుకు రుణాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మహిళలతో కలిసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వీఓఏలకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, మండల వ్యవసాయ అడ్వైజరీ కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, సర్పంచులు గవర భవానీ, రావి రమేష్, నక్కా మణికంఠబాబు, పులి జయబాబు, ఎంపీడీఓ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా.. మహిళలకు ఆర్థిక భరోసా

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: వైఎస్సార్ ఆసరా మహిళలకు మరింత ఆర్థిక భరోసా తీసుకువచ్చిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక ముప్పన రామారావు కమ్యూనిటీ హాలులో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సభలో దవులూరితో పాటు వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం పాలన సాగిస్తున్నారన్నారు. తొలుత సీఎం జగన్ చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం దొరబాబు ఆసరా చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. వైస్ చైర్ పర్సన్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ముప్పన శ్యామలాంబ, కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, గోకేడ అప్పారావు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ క్యాలెండర్ మేరకు పథకాల అమలు..

సామర్లకోట: సంక్షేమ క్యాలెండర్ ముందుగానే ప్రకటించి కచ్చితంగా అమలు చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ ఒక్కరేనని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని పీబీ దేవం గ్రామంలో మండల పరిధి 1623 మహిళా సంఘాలకు రూ.12,14,17,604 జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మూడు విడతలలో రూ.36,44,50,023 లబ్ధి పొందారని తెలిపారు. పీబీ దేవంలోని 181 మహిళా సంఘాలకు రూ.1,68,72,430 వారి బ్యాంకు ఖాతాలకు ఈనెల ఐదో తేదీలోపు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడతాయని తెలిపారు. ఏపీఎం జి.ప్రశాంతి అధ్యక్షత వహించగా ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, ఉపసర్పంచ్ మలకల సత్య, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొరబాబు మహిళా సంఘాలకు చెక్కు అందజేశారు.

క్లుప్తంగా

రెవెన్యూ విధులపై అసిస్టెంట్ కలెక్టర్ శిక్షణ



మండల అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్

సామర్లకోట: అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ కలెక్టరుగా శిక్షణలో భాగంగా నెల రోజుల పాటు విధులు నిర్వహిస్తారని కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు కార్యాలయ విధులపై చర్చించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీనివాసరావు నుంచి సమాచారం సేకరించారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అసిస్టెంట్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మాండవ్య నారాయణుని కల్యాణం

సామర్లకోట: చైత్ర శుద్ధ ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీ, భూ సమేత మాండవ్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం స్వామి, అమ్మవార్లకు మంగళ స్నానాలు, పంచామృతాభిషేకం, రాత్రికి కల్యాణం, దీపారాధనలు జరుగుతాయని చెప్పారు. నాలుగో తేదీ వరకు పూజలు, సాయంత్రం గ్రామోత్సవం, ఐదున పూర్ణాహుతి, ఏడో తేది రాత్రి శ్రీపుష్పయోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల రవికుమార్, రఘురామ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

గుడివాడ ఎంపీటీసీ నాగమణి మృతి



నాగమణి (ఫైల్)

పెద్దాపురం: మండలంలోని గుడివాడ ఎంపీటీసీ కామిశెట్టి నాగమణి (50) శుక్రవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగమణికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. 2020 ఎంపీటీసీ ఎన్నికల్లో గుడివాడ-సిరివాడ ఎంపీటీసీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొందారు. ఆమె అంత్యక్రియలకు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి తదితరులు హాజరై సంతాపం తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం పిఠాపురంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఈఈ జి. ప్రసాద్ తెలిపారు. రజకపేట, సూరవరపువారి వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, సాయిబాబా గుడి, చర్చి సెంటర్, ఎస్‌బీఐ సెంటర్, మెయిన్ రోడ్డు, కోటగుమ్మం సెంటర్, ఉప్పాడ సెంటర్, మిరపకాయల వీధి, అంబేడ్కర్ సెంటర్, పాత బస్టాండ్, షష్టికర్ణాల వీధి, రాజుగారికోట, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

అయ్యప్పస్వామి ఆలయంలో చోరీ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు అయ్యప్పస్వామి ఆలయంలో హుండీ చోరీకి గురైనట్టు ఆలయ కమిటీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. రూ.25 వేల వరకు నగదు చోరీకి గురై ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏపీ మల్లవరంలోని మరో దేవాలయంలో హుండీని దొంగలు దోచుకునేందుకు విఫలయత్నం చేసినట్టు స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలి : డీపీఓ విక్టర్



ఆర్‌బీ కొత్తూరులో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ విక్టర్

పెద్దాపురం: ప్రజారోగ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అన్నారు. మండలంలోని ఆర్‌బి కొత్తూరులో శుక్రవారం సంపద తయారీ కేంద్రం, ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి ప్రజారోగ్యాన్ని కాపాడాలన్నారు. సంపద తయారీ కేంద్రాల వద్ద మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ వాటిని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం గ్రామంలోని సంపద తయారీ కేంద్రం, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. డీపీఓ వెంట ఇన్‌చార్జి ఈఓ పీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

జాతీయస్థాయి సదస్సుకు కమిషనర్ రమేష్

కాకినాడ: కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వంటి స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టి, మౌలిక వసతుల మెరుగుదలకు తీసుకోవలసిన చర్యలపై చర్చించేందుకు విశాఖలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి సదస్సుకు నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో శుక్రవారం సదస్సు జరిగింది.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పి.దొంతమూరులో గడపగడపకూ మన ప్రభుత్వం



పి.దొంతమూరులో లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని పి.దొంతమూరులో ఆయన శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతికుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గడపనూ సందర్శించి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించడంతో పాటు ఇంకా ఏఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ముందుగా గ్రామాల్లోని ప్రధాన సమస్యలపై దృష్టి పెట్టి వారి పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, కొత్తపల్లి రమణబాబ్జి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, ఉలిశెట్టి సత్యనారాయణ, కనకం, దాసరి బాబ్జి, గుండ్ర సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి మరచిపోయిన వ్యక్తికి జీఆర్పీ సిబ్బంది శుక్రవారం అందజేశారు. గురువారం రాత్రి గస్తీ తిరుగుతున్న సీహెచ్ గౌరీలక్ష్మి చార్జింగ్ పెట్టి ఉన్న ఫోన్‌ను గమనించారు. ఫోన్‌లో కాంటాక్ట్ నంబర్ల ఆధారంగా రంగారెడ్డి జిల్లా మూసాపేటకు చెందిన కుప్పల విజయలక్ష్మిదిగా గుర్తించారు. స్థానిక చిత్రాడలో ఆమె బంధువు కుప్పల శివనారాయణకు ఆ సెల్‌ఫోన్‌ను శుక్రవారం అందజేశారు.

ఫ్యాకల్టీలకు సత్కారం



ఈటీసీలో ఫ్యాకల్టీలను సత్కరించిన ప్రిన్సిపాల్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆపద మిత్రలకు శిక్షణలు విజయవంతంగా ముగిసాయి. ఈ మేరకుఫ్యాకల్టీలను ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ సత్కరించారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

సామర్లకోట: జి.మేడపాడు-బిక్కవోలు రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే పోలీసులు గుర్తు తెలియని మృత దేహాన్ని గుర్తించారు. రైల్వే కీమేన్ భన్వర్‌లాల్ మీనా పట్టాలపై గుర్తు పట్టలేని విధంగా ఉన్న మృతదేహంపై రైల్వే ఎస్ఎస్ పి.అనంతలక్ష్మికి ఫిర్యాదు చేశాడు. ఆమె సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని సమాచారం సేకరించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.లోవరాజు తెలిపారు.

ప్రజల గుండెల్లో జగన్‌కు సుస్థిర స్థానం

- 'హౌసింగ్' చైర్మన్ దవులూరి
- పి.వేమవరంలో గడప గడపకూ..



పి.వేమవరం లబ్ధిదారుతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రజల గుండెల్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గడపగడపకు తిరుగుతున్న సమయంలో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలో పి.వేమవరంలో పార్టీ నాయకులు ఎలిశెట్టి భీమన్నదొర, ఎలిశెట్టి నరేష్, ముసిరెడ్డి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను దొరబాబు వివరించారు. మరో పర్యాయం జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, స్వయంభూరపు వీరభద్రరావు, సేపెని సురేష్ పాల్గొన్నారు.

అధికారుల తీరుపై గరంగరం



పిఠాపురం కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరుపై మండిపడుతున్న కౌన్సిలర్లు

పిఠాపురం: కౌన్సిలర్లకు విలువ లేకపోతే ఎలా అంటూ పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరును దుయ్యబట్టారు. అధికారుల తీరుకు నిరసనగా కౌన్సిలర్ బోను దేవ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అధికారులు ఎజెండాలో పొందుపరచిన అంశాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బోను దేవ మాట్లాడుతూ కౌన్సిలర్లు అంటే అధికారులకు చిన్న చూపుగా ఉందన్నారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, అలాంటప్పుడు సమావేశాలకు తాము రావడం ఎందుకు అంటూ అసహనం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లకు విలు లేని సమావేశంలో తాను ఉండలేనంటూ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అధికారుల తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేయడంతో కొంత సేపు సమావేశంలో గందరగోళం నెలకొంది. చివరకు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ సర్ది చెప్పడంతో ఎజెండాలో అంశాలపై చర్చ జరిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం



గృహ సారథుల శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం పిఠాపురంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షమ పథకాల అమలులో దేశానికే గర్వకారణంగా ఉన్న మన రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకే సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను నియమించారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమం ద్వారా గ్రామాలు, వార్డుల్లో వలంటీర్లతో పాటు పర్యటించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎవరికైనా ఏకారణం చేతనైనా పథకాలు అందక పోతే సమస్యలను పరిష్కరించి వారికి పథకాలు అందేలా చేయాలన్నారు. గృహ సారథులు పార్టీ విజయానికి రథ సారథులుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి పెట్టండి

- కాలుష్యం, పశువుల సంచారంపై చర్యలు అవశ్యం
- అధికారులకు కౌన్సిలర్ల సూచన



అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్

పెద్దాపురం: ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలని అధికారులకు కౌన్సిల్ సూచించింది. పురపాలక సంఘ సర్వ సభ్య సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, ఆకుల కృష్ణ బాపూజీ మాట్లాడుతూ ఆశీళ్లు, ఇంటి పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టిపెట్టాలని సూచించారు. దీనిపై వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ కలుగజేసుకుని ఆశీలు పాటలకు కేవలం జీఎస్టీ వల్లే తక్కువ పాటకు వెళ్లినట్టు తెలిపారు. ప్రభుత్వ భవనాల నుంచి రావలసిన పన్నులపై కమిషనర్ జంపా సురేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉందని, ఇప్పటికే ఆయా శాఖల అధికారులకు నోటీసులు ఇచ్చామన్నారు. రాజశేఖర్, ఆరెళ్ళి వీర్రాఘవులు మాట్లాడుతూ కాలుష్యం, పందులు, కుక్కల సంచారంపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మిలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలో సుమారు 8 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని రూ.148 కోట్లతో మూడు దఫాల్లో పైప్‌లైన్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో టీపీఓ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆర్ఓ చంద్రశేఖర్, మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ముప్పన శ్యామలాంబ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పంపై అవగాహన అవసరం

- ఎంపీడీఓ శ్రీలలిత



సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓలు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది

సామర్లకోట: ఆరోగ్య గ్రామాలే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన స్వచ్ఛ సంకల్ప శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. జిల్లాలోని ఏడు మండలాలకు చెందిన మోడల్ గ్రామాలకు ఉండూరు సంపద తయారీ కేంద్రం వద్ద ముగింపు శిక్షణలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. స్వచ్ఛ సంకల్పంపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు అవగాహన ఉండాలన్నారు. రోడ్లపై, డ్రైన్లలో చెత్త వేయకుండా ప్రజలల్లో అవగాహన పెంచాలన్నారు. కిర్లంపూడి మండలాన్ని మోడల్ మండలంగా ఎంపిక చేసి అన్ని గ్రామాలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. సంపద తయారీ కేంద్రాలల్లో ఉత్పత్తి చేస్తున్న వర్మీ కంపోస్టుపై అవగాహన పెంచాల, ఇందులో భాగంగా ఆర్పీకేల్లో వీఏఏలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉండూరు సంపద తయారీ కేంద్రంలో తయారు చేసిన వర్మీ కంపోస్టును శిక్షణకు హజరైన వారికి చూపించారు. కిర్లంపూడి ఎంపీడీఓ పి.సతీష్‌బాబు, ఈఓపీఆర్డీ పి.శ్రీనివాసరావు, ఉండూరు సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, ఉపసర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

నాటి ప్రతిపాదనలకు నేడు పనులు

- ఎమ్మెల్యే చినరాజప్ప
- పట్టణ అభివృద్ధిపై కౌన్సిలర్ల వాగ్వాదం
- వాడి వేడిగా కౌన్సిల్ సమావేశం



సామర్లకోట కౌన్సిల్‌లో ప్రతిపక్ష సభ్యుని ఆరోపణలను తిప్పికొడుతున్న అధికార పక్ష సభ్యులు

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలుతో పాటు, దీర్ఘకాలిక సమస్యలైన ఎఫ్‌సీఐ రోడ్డు, అమ్మాణమ్మ అపార్ట్‌మెంట్ రోడ్లను నిర్మించామని అధికార పక్ష కౌన్సిలర్లు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఈ వ్యాఖ్యలపై స్వల్ప దుమారం రేగింది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా పాల్గొన్న సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పితాని కృష్ణ, సేపెని సురేష్, నేతల హరిబాబు తదితరులు చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్ష కౌన్సిలర్ బలుసు వాసు కలగజేసుకుని పార్టీ భజన ఆపాలని వ్యాఖ్యానించారు. దీంతో స్వల్పంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఎమ్మెల్యే చినరాజప్ప కల్పించుకుని ఆయా సమస్యలపై తాను హోం మంత్రిగా ఉన్నప్పుడే ప్రతిపాదనలు పెట్టామని, నాడు నిధులు మంజూరు కాకపోవడంతో పనులు జరగలేదని, ప్రస్తుతం నిధులు విడుదలై పనులు జరిగాయని పేర్కొన్నారు.

అనంతరం అజెండాలో అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. నేతల హరిబాబు మాట్లాడుతూ అధికారులకు ఆదాయంపై దృష్టి లేదని, పశువుల కబేళాకు రూ.4.19 లక్షలు వస్తే కేవలం రూ.1.6 లక్షలు వాడడం దారుణమన్నారు. వార్డుల్లో పారిశుధ్యంపై కౌన్సిలర్లు మర్రి శేషారావు, పిట్టా సత్యనారాయణ, కానేటి రాజేశ్వరి తదితరులు, 8వ వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని పిల్లాడి సత్యవతి, 19వ వార్డులో పైపులైను లీకులను అరికట్టాని గొర్రెల జయలక్ష్మి సూచించారు. మెప్మా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పట్టణంలో మూడు గ్రూపులకు ఆసరా అందలేదని కరణం రాజ్‌కుమార్ ఆరోపించగా ఆ నిధులు ఒకేసారి పడేలా చర్యలు తీసుకొంటున్నట్లు మెప్మా అధికారి సుజాత తెలిపారు.

మా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టండి

- అధికారులను కోరిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా గొల్లప్రోలు నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం



గొల్లప్రోలు నగరపంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

పిఠాపురం: తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు అధికారులను కోరారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంధ్రేటి మంగతాయారు అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సందర్భంగా 6వ వార్డు కౌన్సిలర్ గొల్లపల్లి అచ్యుతాంబ మాట్లాడుతూ తమ వార్డులో 14వ ఆర్థిక సంఘం నిధులతో పనులు ఎందుకు చేపట్టలేదని అధికారులను నిలదీశారు. ఇప్పటివరకూ తమ వార్డులో ఒక్క పని కూడా చేపట్టలేదన్నారు. దీనిపై ఏఈ ప్రభాకర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చామని, త్వరలోనే పనులు చేపడతామని తెలరారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆమె సూచించారు. 16వ వార్డు కౌన్సిలర్ బావిశెట్టి జ్ఞానేశ్వరి మాట్లాడుతూ ఇప్పటివరకూ తమ వార్డుల్లో పనులను అజెండాలో ఎప్పుడు పెట్టలేదన్నారు. తమ ఆనందం కోసమైనా వార్డుల్లో అభివృద్ధి పనులను అజెండాలో పెట్టాలని కోరారు. వార్డుల్లో పనులు జరగడం లేదని పలువురు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ సత్యనారాయణ సమాధానం ఇస్తూ వార్డు సచివాలయ నిధులు వార్డులకు సరిపడా కేటాయించామని, ఈ పనులన్నీ టెండర్ల దశలో ఉన్నాయన్నారు. త్వరలోనే పనులు మొదలు పెడతామని తెలిపారు. నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడానికి అందరూ సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ గంధ్రేటి మంగతాయారు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్లు గంధం నాగేశ్వరరావు, తెడ్లపు అలేఖ్యారాణి, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.